క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(గురువారం) విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ములుగులో 11 కేవీ, ములుగు ఫీడర్–1 పరిధిలోని శ్రీనివాసకాలనీ, ప్రగతి కాలనీ, ప్రేమ్‌నగర్, వివర్స్‌కాలనీ, హనుమాన్‌నగర్, గడిగడ్డ, సపాయివాడ, కృష్ణా కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): ఎంపీడీఓగా పోదిలి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రాజేంద్ర ప్రసాద్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో మంగపేట ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను వెంకటాపురం ఎంపీడీఓగా అధికారులు బదిలీ చేశారు.

వెంకటేశ్వరావుకు నివాళి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి గుర్రం వెంకటేశ్వరావు వర్ధంతిని బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. గుర్రం వెంకటేశ్వరావు పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి, తోట నాగేశ్వరావు, గుర్రం పుల్లారావు, చిట్టెం ఆదినారాయణ, దేవమణి తదితరులు ఉన్నారు.

యాదవులకు సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సంజీవ

వాజేడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సీట్లు కేటాయించాలని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల సంజీవ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ తెచ్చిందన్నారు. స్థానిక ఎన్నికల్లో పాల్గొనే అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు సముచిత స్థానం కల్పించి పోటీ చేయడానికి సీట్లు ఇవ్వాలన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



కాటారం: అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక తెలిపారు. కాటారం మండలం అంకుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసం కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగి ఉన్న చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు లాంటి వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షాహిదా బేగం, శ్రీలత, హైమావతి, పుష్పలత, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

పలిమెల: మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన లంగారి రాజు, పలిమెల గ్రామానికి చెందిన కుమ్మరి జంపయ్య 15 రోజుల క్రితం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్నారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జె.రమేశ్ ఆదేశాను మేరకు టెక్ టీం కానిస్టేబుల్ సంతోష్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ రికవరీ సి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను బాధితులకు ఎస్సై రమేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా వ్యక్తులు మొబైలు పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామని తెలిపారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో చెత్తను కాల్చేస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



మంగపేటలో కాల్చివేస్తున్న చెత్త



నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ సెడ్డు

మంగపేట: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్స్ నిరుపయోగంగా మారాయి. గ్రామాలను పారిశుద్ధ్యంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2020లో అప్పటి ప్రభుత్వం పంచాయతీకి ఒకటి చొప్పున రూ 2.50 లక్షల ఈజీఎస్ నిధులతో సెగ్రిగేషన్ షెడ్స్ ఏర్పాటు చేసింది. గ్రామాల్లో రోజు వారీగా సేకరించిన చెత్త ద్వారా వర్మి కంపోస్టు ఎరువు తయారీ చేపట్టాలని వాటిని నిర్మించారు. తయారైన వర్మి కంపోస్టుతో పాటు చెత్త నుంచి వేరుచేసిన ఇనుము, ప్లాస్టిక్, గాజు తదితర వస్తువులను విక్రయించి తద్వార వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. నిర్మాణం చేపట్టిన తర్వాత ప్రారంభ దశలో కొంత మేరకు సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగించిన అనంతరం వాటిని నిరుపయోగంగా వదిలేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

చెత్త సేకరణ పలు గ్రామాల్లో నిలిచిపోగా కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను కాళీ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తు కాల్చేస్తున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, జనసంచార ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారినా సంబంధిత జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంపై విమర్శలు వస్తున్నాయి. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉండి సేకరించిన చెత్తను వర్మికంపోస్టు తయారు చేయకుండా దహనం చేస్తున్న ఎంపీఓ, ఎంపీడీఓకు స్పందించకపోవడం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్స్ నిర్వహణ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను కాల్చేస్తున్నారు..



మండలంలో గ్రామ పంచాయతీల అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్స్‌లో వర్మికంపోస్టు తయారీ నిర్వహణను పూర్తిగా వదిలేశారు. కొన్ని గ్రామాల్లో సేకరించే చెత్తను అటవీ ప్రాంతం, సెగ్రిగేషన్ షెడ్స్, స్మశానవాటికల ప్రాంగణంలో వదిలి కాల్చివేస్తున్నారు.

\- సురేశ్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు

వినియోగంలోకి తీసుకొస్తాం..



మండలంలోని సెగ్రిగేషన్ షెడ్స్ నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత పంచాయతీల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్స్‌లో వర్మికంపోస్టు తయారీ చేసే విదంగా ఎక్కడ కూడా నిరుపయోగంగా ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

\- భద్రునాయక్, ఎంపీడీఓ, మంగపేట

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఏటూరునాగారం: పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు



ఎస్ఎస్ తాడ్వాయి: ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని షాపెల్లికి చెందిన మాదరి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు బుధవారం పరామర్శించారు. అదేవిధంగా చెల్పాక గ్రామానికి చెందిన ఊకే కృష్ణారావు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తుమ్మ మల్లారెడ్డి, అశోక్, ప్రదీప్‌రావు, శ్రీనివాస్, రఘు, నర్సింహులు, చంద్రబాబు, బోజారావు, చంద్రమౌళి, రాంబాబు, చిరంజీవి, రాజు, శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో ఇందిరానగర్‌కు చెందిన గిరబోయిన ప్రమీల ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటంబాన్ని జిల్లా వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాంబయ్య, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, సింగిల్ విండో డైరెక్టర్ సిద్ధిరెడ్డి, జగదీశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వావిలాల రాంబాబు, వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు వీరబాబు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రాహిల్

వాజేడు: చర్మ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాహిల్ వైద్య శిబిరం నిర్వహిచారు. జ్వరంతో బాధపడుతున్న 10 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. వైరల్ ఫీవర్ కావడంతో ఎలాంటి ప్రమాదం లేదని సూచించారు. కాలానుగుణంగ వచ్చే వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి



వెంకటాపురం(కె): ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కన్నాయిగూడెంలో..

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంబాబు

వెంకటాపురం(కె): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు అన్నారు. బుధవారం మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేసిన మోసాలను కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో ముద్రించి ప్రజల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం గంపా రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను అమలు చేయటం లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. నాయకులు డర్రా దామోదర్, లక్ష్మీనారాయణ, ముడుంబా శ్రీనివాస్, చిడెం రవికుమార్, శివాజీ, శాంతమూర్తి, వివేక్ తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: మండ పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసపూరిత వాగ్దానలపై బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ 22 నెలల కాలంలో హామీలు అమలు చేయడంతో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ తదితరులు ఉన్నారు.

గెలుపు గుర్రాల వేట!

గోవిందరావుపేట: స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడి ఎక్కింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుండడంతో గెలుపు గుర్రాల వేటలో ప్రధాన పార్టీలు అన్వేషణ ప్రారంభించారు. స్థానిక ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలలో రిజర్వేషన్లు ఆయా సామాజిక వర్గాల బలాబలాలకు అనుగుణంగా గెలుపు గుర్రాల ఎంపికపై పార్టీల నేతలు అందరితో సమాలోచనలు వ్యూహరచనలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గోవిందరావుపేట కావడంతో స్థానిక ఎన్నికల్లో తనదైన ముద్ర వేసుకోవాలని స్థానికంగా అభ్యర్థుల ఎంపిక పై ప్రత్యేక దృష్టి సారించారు. మరో వైపు అధికార పార్టీ అభ్యర్థులను ఎదుర్కోనేందుకు బలమైన అభ్యర్థులను ఎన్నికల బరిలో దించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు ముందుకు వెళ్తున్నారు. అదే విధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఆ పార్టీ మండల అధ్యక్షుల సమన్వయంతో బలమైన వ్యక్తులను నిలబెట్టేందుకు వ్యూహరచనలు చేస్తున్నారు.

వీలైనంత త్వరలో ఎంపిక..

ఎవరెవరూ పోటీలో ఉంటారనే దానిపై ఆశావాహుల పేర్లను ఆయా పార్టీల మండల అధ్యక్షులు సేకరించి ముఖ్య నేతలతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులకు పంపిస్తున్నారు. ఐతే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికతో సహా ఓటర్ల వద్దకు ఎలా వెళ్లాలనే అంశాలపై పార్టీల ముఖ్య నేతలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను వీలైనంత త్వరగా ఎంపిక చేసే పనిలో ఉన్నారు.

అభ్యర్థుల జల్లెడ..

ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థులను సర్వే ప్రతిపాదికన ఎంపిక చేస్తామని చెబుతున్నారు. ముందుగా ఆశావాహులతో దరఖాస్తులు స్వీకరించి సమగ్ర సర్వే అందరి సమాలోచనలతో అభ్యర్థులను జల్లెడ పట్టే పనిలో పడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోను గెలుపు గుర్రాలకే టికెట్లు అనే సంకేతాలు ఇస్తున్నారు. రిజర్వేషన్లు ఉన్న స్థానాలతో పోలిస్తే జనరల్ స్థానాల్లో పోటీ అధికంగా ఉంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గెలుపు కోసం తాము పడిన కష్టాన్ని గుర్తు చేస్తూ రిజర్వేషన్ తమకు అనుకూలం అని ఈ సారి తమకు తప్పకుండా అవకాశం ఇవ్వాలని కొందరూ ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. ఐతే కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్ ఇస్తే ఓ పంచాయితీ.. ఇవ్వకపోతే మరో పంచాయితీ వస్తుందంటూ పార్టీ ముఖ్య నేతలు తలలు పట్టుకుంటున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



ఎస్ఎస్ తాడ్వాయి: సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి



గోవిందరావుపేట: మాట్లాడుతున్న యూత్ నాయకులు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి

ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేసి సత్తాచాటాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలాభివృద్ధి కోసం మంత్రి సీతక్క ఎంతోగాను కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బొల్లు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, జాతర చైర్మన్ లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు బండారి చంద్రయ్య, రాజిరెడ్డి, రాజశ్రీ, పాయం కవిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సత్తా చాటాలి అని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. సీతక్కపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, పెండెం శ్రీకాంత్, గొంది కిరణ్, కోరం రామ్మోహన్, జక్కు రణదీప్ గౌడ్, పొన్నం సాయి, కొల్లు శ్రీనివాస్ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అధ్యక్షురాలిగా మమత



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ గ్రామానికి చెందిన రుద్రారపు మమత మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య, నాయకులు మామిడిశెట్టి కోటి, అల్లాడి రాజేశ్వర్ రావు, జంగిలి రవి, చీకుర్తి రమేష్, చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, కొంపెల్లి రాజిరెడ్డి, జాకీర్, వెంకటేష్, మొగిలి పాల్గొన్నారు.

టికెట్ కోసం పూజలు

చిట్యాల: మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతికి జెడ్పీటీసీ టికెట్ రావాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే వారే నిజమైన నాయకులని, అలాంటి మంచి వ్యక్తి తిరుపతి అన్నారు. నాయకులు జన్నె నరేష్, బుర్ర మల్లేష్, మొలుగూరి కుమార్, గుర్రపు అశోక్ ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

- డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం: గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని గంగారం తండాలో పోలీసులు బుధవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా సోదాలు నిర్వహించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్డెన్ సర్చ్‌లో భాగంగా 600 లీటర్ల జాగిరి వాష్, 60 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 17బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో గుడుంబా తయారీకి పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. యువత మత్తు పదార్థాలు, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామంలో గుడుంబా కట్టడికి నడుం కట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, మహాముత్తారం ఎస్సై మహేందర్, ఎస్సై–2 రాజశేఖర్, ఎస్సై–3 మానస, టిజిఎస్పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

భూపాలపల్లి అర్బన్: కార్మికులు అనారోగ్య బారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలు తప్పకుండా పాటించాలని సింగరేణి మెడికల్ అధికారి డాక్టర్ పద్మ సూచించారు. బుధవారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో ఉద్యోగులకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. గుండె జబ్బులు రావడానికి కారణాలు వివరించారు.గని మేనేజర్ రమేష్, వెల్ఫేర్ అధికారి సందీప్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

- ఏఓ కల్యాణి



యూరియాను అందిస్తున్న ఏఓ కల్యాణి

టేకుమట్ల: మండల రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి కల్యాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలలోని యూరియా నిల్వలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు రైతులకు సరిపడా యూరియా లభిస్తుందని, ఇప్పటి వరకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా 780, ప్రైవేటు డీలర్ల ద్వారా 650 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే నానో యూరియా 850లీటర్లను సరఫరా చేసినట్లు తెలిపారు. మండలంలోని టేకుమట్ల, పంగిడిపల్లి, బూర్నపల్లి, యూరియా కావాల్సిన రైతులు ఆధార్, పట్టాపాస్‌బుక్ తీసుకుని యూరియా పొందలన్నారు. ఆమె వెంట ఏఈఓ రాహుల్, రైతులు, ఆగ్రోస్ నిర్వాహకులు ఉన్నారు.

రిజర్వేషన్లు కల్పించొద్దు

కాళేశ్వరం: క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీ, బీసీ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించొద్దని మహదేవపూర్ తహసీల్దార్ రామారావుకు నేతకాని రాష్ట్ర యువజన నాయకులు దుర్గం శ్రీనివాస్, బీసీ నాయకులు శ్రీధర్, శ్రీనివాస్ బుధవారం వినతిపత్రం అందజేశారు. మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా కుల ధ్రువీకరణ పత్రాలతో రిజర్వు సీట్లలో ఎన్నికల్లో పోటీ చేయకుండా వారి కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

నిలిపి ఉన్న లారీల్లో డీజిల్, టైర్లు చోరీ



టైర్లు చోరీకి గురైన లారీ

మల్హర్: మండలంలోని కొయ్యూరు పరిధిలో మూసియున్న పెట్రోల్ పంపులో నిలిపి ఉన్న లారీలో లారీకి బిగించి ఉన్న నాలుగు టైర్లు, స్టెఫిన్ టైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు లారీ యాజమాని శ్రావణ్‌రావు బుధవారం తెలిపారు. లారీకు సపోర్ట్‌గా రెండు బండారళ్లు పెట్టి టైర్లతో పాటు బ్యాటరీస్, 120 లీటర్ డీజిల్, జాకీ ఎతుకెళ్లినట్లు చెప్పారు. వారం రోజుల క్రితం రెండు లారీలలో దాదాపుగా 500 లీటర్ల డీజిల్ దొంగతనం జరిగిందని రెండు సంఘటనలలో కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.